# సంతోష సమయంలో సమ్మతం కాని విషయాలు

**113వ అంశం** శిరోజాలలో సవరాలు, కృత్రిమ కొప్పు, విగ్గులాంటివి పెట్టుకునేవారు ధూత్కరించబడ్డారు.

**114వ అంశం** అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)కు అవిధేయత విషయంలో భార్య భర్త మాట విననవసరం లేదు.

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం ఒక అన్సారీ మహిళ తన కూతురి పెళ్ళి చేసింది. (జబ్బు కారణంగా) ఆ అమ్మాయి శిరోజాలు రాలిపోయాయి. అందుచేత ఆ మహిళ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, "అమ్మాయి జడలో సవరాలు వేయమని మా శ్రీవారు ఆజ్ఞాపించారు (ఇలా చేయవచ్చునా?)" అని అడిగింది. దానికి ఆయన (స), "అలా చేయవద్దు, జడలో సవరాలు వేసేవారు ధూత్కరించబడ్డారు" అని చెప్పారు. - ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[1]

**115వ అంశం** బంగారు వెండి పాత్రలలో (తినే) త్రాగేవాడు తన కడుపును అగ్నితో నింపుకుంటాడు.

హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఎవడయితే వెండీ బంగారు పాత్రలలో అన్నపానీయాలు సేవించాడో అతను తన కడుపును అగ్నితో నింపుకున్నాడు." దీనిని ముస్లిం క్రోడీకరించారు.[2]

**116వ అంశం** బంగారు ఉంగరం తొడిగిన పురుషుడు తన చేతికి నిప్పు రవ్వను ధరిస్తాడు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఒక పురుషుడు తన చేతికి బంగారు ఉంగరం తొడిగి ఉండటం చూసి, ఆ ఉంగరాన్ని తీసి దూరాన విసిరివేశారు. తరువాత ఇలా అన్నారు: "మీలో ఎవరయినాసరే నిప్పు రవ్వలు చేతిలో పట్టుకోవాలనుకున్నవాడే ఇలాంటి (బంగారు) ఉంగరం తొడుగుతాడు". - ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[3]

**117వ అంశం** చీలమండలం క్రిందికి వ్రేలాడేలా ధరించే వస్త్రం పురుషుడ్ని నరకానికి తీసుకుపోతుంది.

---

1. కితాబున్నికాహ్-బాబు లా యతీవుల్ హ్రత జవ్‌జహా ఫీ మాసీయతిహీ.
2. కితాబుల్లిబాస్ వజ్జీనతి.
3. ముఖ్తసర్ సహీహ్ ముస్లిం, లిల్ అల్‌బానీ -హ.నెం.1372

teluguislam.net



దైవప్రవక్త (స) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) తెలిపారు: "చీలమండలానికి క్రింద వ్రేలాడే వస్త్రం నరకానికి పోతుంది." ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[1]

**118వ అంశం ఇతరులకు పోటీగా బడాయి చాటుకుని, మిడిసిపడినందుకు శిక్ష.**

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా చెప్పారు: "ఒక వ్యక్తి రెండు వస్త్రాలను ధరించి గర్వాతిశయంతో నడవసాగాడు. (తన ఖరీదైన వస్త్రాలను చూసుకుని) లోలోపలే మిడిసిపడ్డాడు. అల్లాహ్ అతన్ని భూమిలో కూర్చేశాడు. ఇక అతను ప్రళయదినం వరకూ నిరంతరం భూమిలో కూరుకుపోతూనే ఉంటాడు." - ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[2]

**119వ అంశం పురుషులు పట్టువస్త్రాలు తొడగటం హరామ్ (నిషిద్ధం).**

వివరణ : 111వ అంశం క్రింద ఉన్న హదీసును చూడండి.

**120వ అంశం యంత్ర పరికరంతో శరీరంపై పచ్చబొట్లు, డిజైన్లు వేయించుకునే స్త్రీలపై దేవుని శాపం పడుతుంది.**

**121వ అంశం అందం కోసం ముఖంపైని వెంట్రుకలను తీసే, తీయించుకునే స్త్రీలను అల్లాహ్ ధూత్కరించాడు.**

**122వ అంశం అందం కోసం దంతాలను చెక్కి వెడల్పు చేసుకునే, చేయించుకునే స్త్రీలు అల్లాహ్‌చే ధూత్కరించబడ్డారు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) ఇలా అంటున్నారు: అల్లాహ్ పచ్చబొట్లు వేసే, వేయించుకునే స్త్రీలను, ముఖంపైని రోమాలను తొలిగించుకునే స్త్రీలను, అందం కోసం దంతాలను చెక్కి వెడల్పు చేసే, చేయించుకునే స్త్రీలను శపించాడు. మరలాంటప్పుడు దైవప్రవక్త (స) ఖుద్దుగా శపించిన స్త్రీలను నేనెందుకు శపించకూడదు? (దైవప్రవక్త - స- శాపం దైవశాపానికి నిదర్శనం కదా!) దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ ఆయతు గమనార్హం: "దైవప్రవక్త మీకు ఇచ్చిన దానిని సంతోషంగా పుచ్చుకోండి. ఆయన వారించిన దానికి దూరంగా ఉండండి." (అల్ హష్ర్-7) - దీనిని బుఖారీ పొందుపరిచారు.[3]

వివరణ : గోరింటాకుతో స్త్రీలు తమ చేతులను అలంకరించుకోవచ్చు.

---

1. వస్త్రధారణ ప్రకరణం: అధ్యాయం-చీలమండలానికి క్రింద వ్రేలాడదీసే అంగ వస్త్రం నరకానికి గొనిపోతుంది.
2. వస్త్రధారణ ప్రకరణం: వస్త్రధారణ ద్వారా ఇతరుల ముందు బడాయిని చాటే అధ్యాయం.
3. కితాబుల్లిబాస్- బాబు తహ్‌రీము ఇస్తిమాలిజ్జహబి వల్ ఫిజ్జతి

**123వ అంశం** రూపచిత్రాలు వేసే వారికి ప్రళయదినాన కఠిన శిక్ష విధించ బడుతుంది.

రూపచిత్రాలు వేసేవారికి దైవసన్నిధిలో కఠిన శిక్ష పడుతుందని దైవప్రవక్త (స) చెబుతుండగా తాను విన్నానని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) చెప్పారు. - దీనిని బుఖారీ నమోదు చేశారు.[1]

**124వ అంశం** శరీర భాగాలు కనిపించేలా బిగుతైన దుస్తులు, పలుచటి వస్త్రాలు ధరించే స్త్రీలు స్వర్గానికి పోరు.

దైవప్రవక్త (స) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) తెలియజేశారు: "నరకవాసుల్లోని రెండు రకాల వారిని నేను (ఇంత వరకు) చూడలేదు- వారిలో ఒక రకం జనులెవరంటే; వారి దగ్గర ఎద్దు తోక మాదిరి కొరడాలుంటాయి. వాటితో వారు జనులను కొడుతుంటారు. రెండవ రకం: దుస్తులు ధరించినప్పటికీ నగ్నంగా కానవచ్చే స్త్రీలు. వారు సన్మార్గం నుండి తొలగిపోవటమేగాక, ఇతరులను కూడా పెడదారి పట్టించినవారు. వారి తలలు బుఖ్తీ ఒంటెల మూపురాల వలే వంకరపోయి ఉంటాయి. అలాంటి స్త్రీలు స్వర్గానికి పోలేరు సరికదా, స్వర్గ సువాసనను కూడా ఆఘ్రాణించలేరు. వాస్తవానికి స్వర్గ సువాసన చాలా దూరం నుంచే వస్తూ ఉంటుంది" ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[2]

**125వ అంశం** మగవారిలా తయారయ్యే ఆడవారిని, ఆడంగుల్లా తయారయ్యే మగవారిని దైవప్రవక్త (స) శపించారు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : "దైవప్రవక్త (స) పురుషులను పోలినట్లుగా వేషధారణ చేసే స్త్రీలను, స్త్రీలను పోలినట్లుగా వేషము మార్చుకునే పురుషులను శపించారు."(అహ్మద్, అబూదావూద్-4097,ఇబ్నుమాజా-1904, తిర్మిజీ-2784, బుఖారి-5885)[3]

**126వ అంశం** మద్యం త్రాగే, త్రాగించే, కొనే అమ్మే వారంతా శపించబడ్డారు.

దైవప్రవక్త (స) ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: మద్యం (సారాయి) మూలంగా పది రకాల మనుషులపై అల్లాహ్ శాపం పడుతుంది. 1) దాన్ని పొందే వానిపై, 2) గొడవ చేసేవారిపై, 3) గొడవ చేయించేవారిపై, 4) అమ్మేవానిపై, 5) కొనేవానిపై, 6) మోసుకెళ్ళే వానిపై, 7) ఎవరికోసం మోసుకు వెళుతున్నాడో అతనిపై, 8) మద్యం సొమ్మును తినేవానిపై, 9) మద్యం త్రాగేవానిపై, 10) మద్యం త్రాగించేవానిపై.

(ఇబ్నుమాజా-3380 సహీహ్).[4]

---

1. కితాబుల్లిబాస్ - బాబు అజాబుల్ ముసవ్విరీన యౌమల్ ఖియామతి
2. కితాబుల్లిబాస్ - బాబుత్తసావీర్
3. సహీహ్ సుననె తిర్మిజీ, లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.2235
4. సహీహ్ సుననె ఇబ్నుమాజా, లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.2725

teluguislam.net



## 127వ అంశం స్త్రీలు సువాసన పూసుకుని పురుషుల మధ్యలో నుంచి సాగిపోకూడదు.

హజ్రత్ అబూ మూసా అష్ అరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "సువాసన పూసుకుని, మగవారు తన సువాసనను ఆస్వాదించాలన్న ఉద్దేశంతో వారి మధ్య నుంచి దూసుకు వెళ్ళే స్త్రీ వ్యభిచారిణిగా భావించబడుతుంది.

(నసాయి-5126 హసన్, తిర్మిజి-2786 హసన్).[1]

## 128వ అంశం గడ్డం గీయించకూడదు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: "దైవప్రవక్త(స)గడ్డం పెంచమని, మీసం కత్తిరించమని ఆదేశించారు."- (తిర్మిజీ-2764 సహీహ్).[2]

## 129వ అంశం నలభై రోజులకన్నా ఎక్కువగా గోళ్ళు పెంచటం సమ్మతంకాదు.

దైవప్రవక్త (స) తనకు గోళ్ళు కత్తిరించటానికి, మీసాలు కత్తిరించటానికి, నాభి క్రింది వెంట్రుకలు తొలిగించటానికి (గరిష్టంగా) నలభై రోజుల గడువు విధించారని హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) తెలిపారు. (తిర్మిజీ-2758 సహీహ్).[3]

## 130వ అంశం స్త్రీలు పరదా లేకుండా పురుషుల ముందుకు రాకూడదు.

వివరణ: 102వ నిబంధన క్రింద ఉన్న హదీసును చూడండి.

## 131వ అంశం స్త్రీలు తమ కాళ్లకు గజ్జెలు కట్టరాదు.

దైవప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) తెలిపారు: నేను దైవప్రవక్త (స) చెబుతుండగా విన్నాను, ఆయన (స) ఏమన్నారంటే, "గజ్జెలు, గంటలు ఉండే ఇంట్లో దేవుని (కారుణ్య) దూతలు ప్రవేశించరు. గంటలు ఉపయోగించే వారి వెంట కూడా దైవదూతలు ఉండరు." (నసాయి-5222 హసన్).[4]

## 132వ అంశం సత్య తిరస్కారం, బహుదైవోపాసన, పాపం, అవిధేయతతో కూడుకున్న విషయాలు, ఇంకా స్త్రీ అందచందాలను వర్ణించే, లైంగిక భావోద్రేకాలను రెచ్చగొట్టే విధంగా కవితలను చెప్పటం, పాడటం వారించబడింది.

---

1. సహీహ్ సుననె నసాయి, లిల్ అల్‌బానీ- మూడవ భాగం: హ.నెం.4737
2. సహీహ్ సుననె తిర్మిజీ, లిల్ అల్‌బానీ- రెండవ భాగం: హ.నెం.2218
3. సహీహ్ సుననె తిర్మిజీ లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.2215
4. సహీహ్ సుననె నసాయి లిల్ అల్‌బానీ-మూడవ భాగం, హ.నెం.4718

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) తెలిపారు: మేము దైవప్రవక్త (స)తో కలిసి (మదీనాకు సుమారు వంద కిలోమీటర్ల దూరంలో వున్న) "అర్జ్' ప్రదేశం గుండా సాగిపోతుండగా, ఒక వ్యక్తి కవితా గానం చేస్తూ ఎదురుపడ్డాడు. అప్పుడు ఆయన (స), "ఈ షైతాన్‌ని పట్టుకోండి (లేదా ఆపండి ఈ షైతాన్‌ని) అన్నారు. తరువాత "ఇలాంటి (బూతు) కవితలు నోట్లో వేసుకోవడం కన్నా చీము నెత్తురు కడుపులో నింపుకోవడం నయం" అన్నారు. - ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[1]

## 133వ అంశం పురుషులు, స్త్రీలు (తలకు) నల్లరంగు పూసుకోరాదు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (స) ప్రవచనం- "చివరి కాలంలో కొంతమంది ప్రబుద్ధులు పావురాయి రొమ్ము మాదిరి నల్లరంగును (తలకు) రాసుకుంటారు. ఇలాంటివారు స్వర్గ సువాసనను కూడా ఆస్వాదించలేరు."

(అబూదావూద్-4212, నసాయి).[2]

## 134వ అంశం స్త్రీలు - పురుషులు కలిసి కూర్చొనే విధంగా సభలు, సదనాలు ఏర్పాటు చేయరాదు.

## 135వ అంశం సంగీత వాయిద్యాలు, ఆర్కెస్ట్రా, పాటలు వినటం చెవుల వ్యభిచారం.

## 136వ అంశం పరాయి స్త్రీ-పురుషులు పరస్పరం చెట్టాపట్టాలు వేసుకుని తిరగటం, గుసగుసలాడుకోవటం, కలసి కూర్చోవటం తగదు.

దైవప్రవక్త (స) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలిపారు: "(అల్లాహ్ తన జ్ఞానంతో) ఆదం పుత్రుని వ్యభిచార వాటాను రాసిపెట్టేశాడు. దానికి అతను ఎట్టి పరిస్థితిలోనూ ఒడిగడతాడు (ఎందుకంటే దివ్యజ్ఞానం ఎన్నటికీ తప్పు కాజాలదు). పరాయి వారిని చూడటం కంటి వ్యభిచారం, వినటం చెవుల వ్యభిచారం, మాట్లాడటం నోటి వ్యభిచారం, పట్టుకోవటం (లేదా తాకటం) చేతుల వ్యభిచారం, నడచి వెళ్ళటం కాళ్ళ వ్యభిచారం, కోరిక మనసు వ్యభిచారం. ఇక చివర్లో మర్మస్థానం ఈ విషయాలను నిజం చేసి చూపటమో, అబద్ధంగా నిరూపించటమో చేస్తుంది." -ఈ హదీసును ముస్లిం పొందుపరిచారు.[3]

---

1. కవితా ప్రకరణం - హ.నెం. 2257
2. సహీహ్ సునన్ అబీదావూద్, లిల్ అల్బానీ- మూడవ భాగం, హ.నెం.3548
3. ముఖ్తసర్ సహీహ్ ముస్లిం - లిల్ అల్బానీ, హ.నెం. 1850

teluguislam.net



## 137వ అంశం సంగీత వాయిద్యాలు, గానా బజానాలు, నృత్య కార్యక్రమాలు జరిపేవారిపై దైవాగ్రహం విరుచుకు పడుతుంది లేదా అల్లాహ్ వారిని కోతులుగా, పందులుగా మార్చివేస్తాడు.

● హజ్రత్ అబూమాలిక్ అష్ అరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నా అనుచర సమాజంలోని కొందరు ప్రబుద్ధులు సారాయి త్రాగుతారు. కాని దానికి వేరే పేరు పెడతారు. వారి వద్ద సంగీత పరికరాలు (తబ్లా, హార్మోనియం మొదలగునవి) మ్రోగుతుంటాయి. పాడేవారు పాడుతుంటారు.అల్లాహ్ వారిని భూమిలో దిగదొక్కుతాడు. వారిలో కొందరిని కోతులుగా, పందులుగా మార్చివేస్తాడు."(ఇబ్నుమాజా-4020 సహీహ్)[1]

● హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "ఈ సముదాయం (ఉమ్మత్)పై భూమిలో కూర్చివేసే, ముఖాలు (వికృతంగా) మార్చివేసే, (ఆకాశం నుంచి) రాళ్ల వర్షం కురిసే శిక్ష అవతరిస్తుంది." ముస్లింలలోని ఒకరు, 'ఓ దైవప్రవక్తా(స)! ఈ విధంగా ఎప్పుడు జరుగుతుంది?' అని ప్రశ్నించగా, 'పాటలు పాడుతూ నర్తించే స్త్రీలు పెచ్చరిల్లినప్పుడు, సంగీత వాయిద్యాలు సర్వసామాన్యమై పోయినప్పుడు, మద్యపానం ఎక్కువై పోయినప్పుడు" అని ఆయన (స) సమాధానమిచ్చారు.

(తిర్మిజీ-2212 సహీహ్).[2]

## నికాహ్ నేపథ్యంలో జరిగే కొన్ని పనులు సున్నత్ ద్వారా నిరూపితం కాలేదు:

1. వివాహానికి ముందు 'మంగ్నీ' పేరుతో తంతు ముగించటం.
2. అబ్బాయి తరపువారు అమ్మాయి ఇంటికి ప్రత్యేక నజరానా తీసుకెళ్ళటం.
3. మంగ్నీ (నిశ్చితార్థం) సమయంలో అబ్బాయి చేతికి బంగారు ఉంగరం తొడిగించటం.
4. మెహందీ (గోరింటాకు), పసుపు కుంకుమల ఆచారం చేయటం.

   (వివరణ: వధువు గోరింటాకు పూసుకోవటం ధర్మసమ్మతమే. కాని దానికోసం ఒక ప్రత్యేక సదనం ఏర్పాటుచేసి గానాబజానా పెట్టడం మాత్రం అధర్మం.)
5. అబ్బాయి-అమ్మాయి పరస్పరం 'సలామీ' ఇచ్చుకోవటం.
6. కాబోయే వధూవరులు ఒండొకరు కలిసి తిరగటం.
7. 32 రూపాయల అత్యల్ప మహర్ నిర్ధారించటం లేదా స్థోమతకు మించిన మహర్ భారం వరునిపై మోపటం.

---

1. సహీహ్ సుననె ఇబ్నుమాజా. లిల్ అల్బానీ - రెండవ భాగం, హ.నెం.3247
2. సహీహ్ సుననె తిర్మిజీ- హ.నెం.2212

8. అమ్మాయి కొత్తకాపురం కోసం 'జహేజ్' పేరిట విలాసవంతమైన వస్తుసామగ్రిని సమకూర్చటం.
9. వరకట్నం కోసం, గృహసామగ్రి కోసం అమ్మాయి తల్లిదండ్రులను డిమాండు చేయటం.
10. వరుడు 'సహ్రా' కట్టడం.
11. భారీ సంఖ్యలో బంధుమిత్రులను తీసుకుని ఊరేగింపుగా వధువు ఇంటికెళ్ళటం.
12. బాజా బజంత్రీలు పెట్టడం.
13. నికాహ్ ప్రసంగానికి ముందు వధూవరుల చేత 'కలిమయె షహాదత్' (సాక్ష్య వచనం) పలికించటం.
14. నికాహ్ అయిపోగానే ఖర్జూరం, బాదం, పటిక బెల్లం చల్లటం.
15. వరుని జోళ్లు దాచిపెట్టి, డబ్బులిచ్చిన మీదట తిరిగి ఇవ్వటం.
16. ఖుర్ఆన్ నీడలో వధువును అత్తవారింటికి సాగనంపటం.
17. 'జల్వా' పేరుతో అపసవ్యమైన చేష్టలు చేయటం.
18. ముహర్రమ్ నెలలో, పండుగ మాసాలలో పెళ్ళిళ్లు చేయకపోవటం.
19. తమ తాహతుకు మించి వలీమా విందు ఇవ్వటం.
20. ఆర్కెస్ట్రా, డ్యాన్స్ ప్రోగ్రాములు పెట్టడం.
21. వీడియోగ్రఫీ ద్వారా పెళ్ళి ఫిల్మ్ నిర్మించటం.
22. నికాహ్ సందర్భంగా మస్జిద్ కోసం ప్రత్యేకంగా చందాలు వసూలు చేయటం.
23. వరుని తరఫున డబ్బు వసూలు చేసి నౌకర్లకు 'మామూలు' ఇవ్వటం.
24. విడాకులిచ్చే సంకల్పంతో నికాహ్ చేసుకోవటం.
25. పురుషుడు రెండో పెళ్ళి కోసం మొదటి భార్య అనుమతి పొందటం.